క్లుప్తంగా

నాణ్యమైన భోజనం వడ్డించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ ఆదామ్‌బాషా

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా చూసుకోవాలని ఎంఈఓ ఆదామ్‌బాషా సూచించారు. మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం రుచిచూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. భోజన ఏర్పాట్లపై ఆయన ఉపాధ్యాయులకు, నిర్వాహకులకు సూచనలు చేశారు. అదేవిధంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, రికార్డులను పరిశీలించారు.

నెలాఖరులోగా పంట నమోదు చేయించుకోవాలి



వెంకటగిరిలో పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: ఖరీఫ్ కింద సాగు పంటలు సాగు చేసిన ప్రతి రైతు నెలాఖరులోగా పంట నమోదు చేయించుకోవాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. గురువారం మండలంలోని గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది నిర్వహిస్తున్న పంట నమోదును పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ మండలంలో 35,669ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణం ఉండగా, ఇప్పటి వరకు 12,062ఎకరాల్లో మాత్రమే పంట నమోదైందన్నారు. మిగిలిన రైతులు కూడా త్వరగా నమోదు చేయించుకోవాలన్నారు.

సామర్థ్య పరీక్ష తనిఖీ

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 10వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లలో నిర్వహిస్తున్న సీబీఎస్ఈ సిలబస్‌పై సామర్థ్య పరీక్షను ఎంఈఓ జ్యోతి తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరును ఉపాధ్యాయులను ఎంఈఓ అడిగి తెలుసుకున్నారు.

నేడు గ్రామ సభలు

సి.బెళగల్: మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో శుక్రవారం గ్రామ సభలను నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ సందీప్ తెలిపారు. 18 గ్రామ పంచాయతీలలో ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలను కార్యదర్శులు నిర్వహిస్తారని, మండల స్థాయి అధికారి పర్యవేక్షిస్తారన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే గ్రామ సభలకు ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొనాలని సూచించారు. ఉపాధి పథకంలో భాగంగా గ్రామంలో 2024- 2025 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గుర్తింపు, తీర్మానాలు చేయాల్సి ఉంటుందన్నారు.

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని బొమ్మల దేవాలయంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు ఈఓ ఆనందరావు తెలిపారు. సర్పంచ్ అధ్యక్షతన ఉదయం 11గంటలకు నిర్వహించే సభకు ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరు కావాలని కోరారు. గ్రామాల్లో ఉపాధి పథకం కింద చేపట్టాల్సిన పనులు గుర్తించి తీర్మానం చేస్తామని వివరించారు.

గూడూరు కమిషనర్ బదిలీ

కోడుమూరు రూరల్ : గూడూరు నగర పంచాయతీ కమిషనర్ దివాకర్‌రెడ్డి బదిలీ అయ్యారు. అనంతపురం జిల్లా రాయదుర్గం మున్సిపల్ కమిషనర్‌గా ఆయనను నియమిస్తూ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే గత కొన్నిరోజులుగా కమిషనర్‌గా సెలవులో ఉన్నారు. ఈయన స్థానంలో గూడూరు నగర పంచాయతీ మేనేజర్ రవికుమార్ ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ట్రాఫిక్ జామ్

కల్లూరు: కర్నూలు, కోడుమూరు రోడ్డులోని పెద్దపాడు దగ్గర గురువారం సుమారు గంటసేపు ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఓ వాహనం మరమ్మతుకు గురవ్వడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. పెద్దపాడు దగ్గర ట్రాఫిక్ అవ్వడంతో కర్నూలు నుంచి వారి సొంత ఊర్లకు, గ్రామాలకు వెళ్లాల్సి వారు, అలాగే ఉద్యోగులు, ఇతర ప్రాంతాల నుంచి కర్నూలుకు వచ్చే ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఈ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు, వేలాది ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు.

గ్రామ సభలను విజయవంతం చేయాలి

గడివేముల: మండలంలో నిర్వహించే గ్రామ సభలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే అభివృద్ధి పనులు గుర్తించేందుకు శుక్రవారం సర్పంచ్ అధ్యక్షతన ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభలు నిర్వహిస్తున్నామని, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు.

ముంచిన మొక్కజొన్న విత్తనాలు

- నకిలీ విత్తనాలతో రెండున్నర నెలలైనా కంకులురాని వైనం
- సమస్యను వివరించినా స్పందించని వ్యాపారి
- ఆందోళన చెందుతున్న రైతులు



మంచాలకట్టలో సాగు చేసిన మొక్కజొన్న పంట



విత్తనాలు లేని మొక్కజొన్న కంకులు

గడివేముల: అన్నదాతను ఏదో ఒక రూపంలో కష్టాలు వెంటాడుతున్నాయి. ఆరుగాలం చమటోడ్చి పనిచేసినా నష్టపోతూనే ఉన్నారు రైతులు. ఈసారి నకిలీ విత్తనాలు నట్టేట ముంచాయి. వర్షాభావ పరిస్థితులు వెంటాడుతుండగా నకిలీ విత్తనాలు నట్టేట ముంచుతున్నాయి. విత్తన విక్రయదారుల నిర్వాకంతో రైతులు అప్పులపాలవుతున్నారు. ఈయేడు నకిలీ మొక్కజొన్న విత్తనాలతో గడివేముల మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామ రైతులు నష్టపోయారు. గతేడాది మొక్కజొన్న సాగులో రైతులు లాభాలు గడించారు. మండలంలో ఏడువేల హెక్టార్లకుపైగా మొక్కజొన్న సాగు చేయగా మంచి దిగుబడులు లభించాయి. ఎకరాకు 35 క్వింటాళ్లకుపైగా దిగుబడులురాగా గిట్టుబాటు ధర సైతం రూ. రెండువేలు పలకడంతో రైతులు లాభపడ్డారు. దీంతో ఈయేడు సైతం మొక్కజొన్నసాగుకు మొగ్గు చూపారు. మండల వ్యాప్తంగా ఖరీఫ్ లో 22 వేల ఎకరాల్లో సోయాబీన్, పత్తి, మినుము, మిరప తదితర పంటలు సాగు చేయగా అందులో మొక్కజొన్న 8 వేల ఎకరాల్లో సాగు అయినట్లు అంచనా. అయితే మంచాలకట్ట రెతులు ఓ కంపెనీ విత్తనాలు కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపోయారు.

కంకుల్లో విత్తనాలు రాని పరిస్థితి....

మండలంలోని మంచాలకట్ట గ్రామానికి చెందిన రైతులు నందికొట్కూరులోని ఓ దుకాణంలో మొక్కజొన్న విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేశారు. కొత్తరకం విత్తనాలు అయినా వ్యాపారిపై నమ్మకంతో మొక్కజొన్న విత్తనాలు తీసుకున్నారు. ఈ మేరకు బిల్లులు కూడా తీసుకున్నారు రైతులు. అయితే మొక్కలు సరిగ్గా పెరగలేదు. రెండున్నర నెలలు దాటినా కంకుల్లో పూర్తిగా విత్తనాలురాని పరిస్థితి. దీంతో అయోమయానికి గురైన రైతులు సమస్యను విత్తన వ్యాపారికి వివరించారు. తమకు పంటలను సాగు చేయడానికి రాదని వ్యాపారి బుకాయిస్తున్నాడని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విత్తనం ఖర్చు, సేద్యం, రసాయన ఎరువులు, నీళ్ల మందుల కోసం ఎకరానికి రూ. 30 వేలు పెట్టుబడి పెట్టినా ఫలితం లేకుండా పోయిందని వా పోయారు. ఆ వ్యాపారిపై చర్యలు తీసుకుని న్యాయంచేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

విత్తన వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి



నేను ఈ ఏడాది 4 ఎకరాలలో మొక్కజొన్న పంటను సాగు చేశాను. రెండు నెలల ఇరవై రోజులు కావస్తున్న కంకులు ఇప్పటి సరిగా రాలేదు. పంటకొత 3 నెలల 10 రోజులకే పంట పూర్తవుతుంది. విత్తనాలు విక్రయించిన వ్యాపారిని అడిగితే విత్తన లోపం కాదు. మీ తప్పిదమే అని మాట మారుస్తున్నాడు. హైటెక్ హెచ్‌టీఎంఎన్ 5106 విత్తనాలు అమ్మిన విత్తన వ్యాపారిపై అధికారులు చర్యలు తీసుకొని పరిహారం ఇప్పించాలి. ప్రతి ఏడాది వేరే కంపెనీకి చెందిన విత్తనాలు నాటుకుంటుండంతో మంచి దిగుబడులు వచ్చేవి. ఈ ఏడాది మాత్రమే ఈ రకం మొక్కజొన్న పంటను సాగు చేసి మోసపోయా. అధికారులు పొలాలకు వెళ్లి పత్తి పంటను పరిశీలించి న్యాయం చేయాలి.

– గంగమ్మగారి శ్రీనివాసులు, బాధిత రైతు, మంచాలకట్ట

జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



వ్యవసాయాధికారుల అండతోనే విత్తన వ్యాపార దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నకిలీ విత్తనాలతో రైతులను మోసం చేస్తున్నారు. నాకున్న 5 ఎకరాల మొక్కజొన్న విత్తనాలతో పంట సాగు చేశా. హైటెక్ హెచ్‌టీఎంఎన్ 5106 రకం మొక్కజొన్న విత్తనంతో సాగు చేయగా పైరు పెరగలేదు. కంకుల్లో విత్తనాలు సరిగా రాలేదు. ఎకరాకు 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉంది. అయితే ఈ విత్తనాలతో ఎకరాకు 6-10 క్వింటాళ్లు వచ్చే పరిస్థితి లేదు. వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి. సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– కుర్వ రంగస్వామి, బాధిత రైతు, మంచాలకట్ట

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై బైండోవర్ కేసు తగదు



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

కల్లూరు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై బైండోవర్ కేసు తగదని ఓర్వకల్లు మండలం పాలకొలను గ్రామానికి చెందిన రమేష్ ఖండించారు. గురువారం కల్లూరులోని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్వగృహం దగ్గర నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓర్వకల్లు మండలం పాలకొలను గ్రామానికి చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎలాంటి కేసులు లేని ఐదుమంది వైఎస్సార్‌సీపీ కార్యర్తలపై బైండోవర్ కేసు నమోదు చేస్తామని ఓర్వకల్లు ఎస్‌ఐ స్టేషన్‌కు పిలిపించి, బెదిరించడం తగదన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో భాగంగా రాజకీయ పార్టీలకు చెందని వారిని పిలిపించి బైండోవర్ చేస్తారు. కానీ ఎలాంటి కేసులు లేని ఒకే పార్టీకి చెందని మమ్ములను ఐదు మందిని పిలిపించి బెదిరించడం పోలీసులకు ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులపై అనేక కేసులు ఉన్నా వారిని ఎందుకు బైండోవర్ చేయడం ప్రశ్నించారు. కార్యక్రమంలో రాముడు, శంకర్, సోమన్న, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాలి



మొక్కను నాటుతున్న జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, సర్పంచ్ భాగ్యరత్న



బురాన్‌దొడ్డి జెడ్పీ హైస్కూల్లో మొక్క నాటుతున్న అధికారులు



సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్లో మొక్క నాటుతున్న సర్పంచ్ పాండురంగన్న



మొక్కను నాటుతున్న ఎంపీడీఓ శివనాగప్రసాద్



పాఠశాలలో మొక్క నాటుతున్న ఎంపీపీ, అధికారులు

కోడుమూరు రూరల్: నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాలని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకం కింద 'అమ్మకు ఓ మొక్క' కార్యక్ర మంలో భాగంగా గురువారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ భాగ్యరత్న, అధికారులతో కలి సి జెడ్పీటీసీ మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ చెట్లను విచ్చలవిడిగా నరికేయడం మూలంగా పర్యావరణ సమతుల్యం దెబ్బతింటోందన్నా రు. ప్రతి ఒక్కరూ కనీసం ఓ మొక్కను నాటడంతోపాటు బాధ్యతగా సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఆంధ్రయ్య, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ మోదీన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మొక్కలు పెంచడం సామాజిక బాధ్యత అని ఎంపీడీఓ రాముడు పేర్కొన్నారు. అమ్మ కోసం ఓ మొక్క కార్యక్రమంలో భాగంగా ఉపాధి అధికారులు బురాన్‌దొడ్డి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంను చేపట్టారు. హెచ్ఎం నిర్మళవసంతకుమారి ఆధ్వర్యంలో ఎస్ఎంసీ చైర్మన్ డిష్ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీడీ అల్లిపీర, హెచ్ఎం, సర్పంచ్ రామాంజనేయులుతో కలిసి ఎంపీడీఓ మొక్కలు నాటారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పాఠశాలలో నాటిన మొక్కల సంరక్షణ విద్యార్థులకు అప్పగించాలని సూచించారు. క్రిష్ణదొడ్డి గ్రామంలోని కోనవేంకటేశ్వర స్వామి కొండపై అధికారులు, స్థానికులతో కలిసి మొక్కలు నాటారు.మండల కేంద్రం సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్‌లో సర్పంచ్ పాండురంగన్న, ఎస్ఎంసీ చైర్మన్ గోవిందు మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మన్న, ఈసీ పృధ్వీరాజ్, టీఏలు గోవర్ధన్, రామ్ శంకర్, ఏపీఏలు అబీబ్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: నాటిన మొక్కలను నీళ్లు పోసి సంరక్షించుకోవడం మనందరం బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ శివనాగప్రసాద్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మండలానికి నిర్దేశించిన లక్ష్యం మేరకు 10 వేల మొక్కలను నాటాల్సివుండగా, ఇప్పటి వరకు 90 శాతం పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రామయ్య, ఈఓఆర్డీ సుబ్బరాయుడు, టీడీపీ మండల కన్వీనర్ గోవిందురెడ్డి, నాయకులు రాంభూపాల్‌రెడ్డి, అబ్దుల్లా, నాగరాజు, శోభన్‌బాబు, చంద్ర పెద్దస్వామి తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీపీ బోయ శారద అన్నారు. గురువారం అమ్మకు ఓ మొక్క కార్యక్రమంలో భాగంగా సల్కాపురం గ్రామంలో ఎంపీపీ శారద, ఏపీడి లక్ష్మన్న, ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దిలేటి, ఈఓఆర్డి రవికిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



దుర్గా భోగేశ్వరాలయం ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని



హోమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: ఆధునిక ప్రపంచంలో ప్రతి ఒక్కరూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, ఇష్ట దైవాన్ని స్మరించుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గా భోగేశ్వరాలయం ముఖద్వారాన్ని కాటసాని ప్రారంభించారు. అలాగే సుంకులా పరమేశ్వరీ, గంగమ్మ వార్ల విగ్రహా ప్రతిష్ట మహోత్సవానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరయ్యారు. స్వామివార్ల విగ్రహాలకు పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యేను నిర్వాహకులు, సర్పంచ్ బీఎస్ రామ్మోహన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ప్రతిష్ట కార్యక్రమాల అనంతరం మాజీ ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ నేటి రోజుల్లో ప్రతి ఒక్కరూ పని ఒత్తిడి ప్రభావంతో మనశ్శాంతిని కోల్పోతున్నారన్నారు. ఆలయాలకు వెళ్లి పూజలు చేయడం,తమ ఇష్ట దైవాన్ని ఆరాధించడం ద్వారా మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కులమతాలకు అతీతంగా ఐకమత్యంగా అందరు కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అలాగే హిందూ ప్రాచీనా కళకలు, సంస్కృతి,సాంప్రదాయల కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని సూచించారు. ధార్మిక కార్యక్రమాలతో మనుషుల ప్రవర్తనలో ఎంతో మార్పు వస్తుందని, దురలవాట్లను సైతం దూరం చేసుకోవడానికి దోహ పడతాయన్నారు. గ్రామంలో అందరూ ఆయురాగ్యోలతో సుభిక్షంగా ఉండాలని కోరుతూ గ్రామానికి చెందిన బీఎస్ శ్రీనాథరెడ్డి తన సొంత ఖర్చులతో భోగేశ్వరాలయం ముఖద్వారం నిర్మాణం, సుంకులా పరమేశ్వరీ దేవాలయం ఆలయ నిర్మాణంతో పాటు అమ్మవారి విగ్రహా ప్రతిష్ట కార్యక్రమానికి ఆర్థికంగా సహకరించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఉప సర్పంచ్ గోదా ప్రసాద్, కో-లప్షన్ సభ్యుడు ఉశేన్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లారెడ్డి, గని ఆనంద్, చంద్రమౌళీశ్వరరెడ్డి, మేఘనాథరెడ్డి, ఏరాసు హరినాథరెడ్డి, పరమేశ్వరరెడ్డి, రమణమూర్తి, గోపాలయ్య, జక్కుల వెంకటరమణ, చింతల నారాయణ, రమేష్, చింతల రమణ, చందుయాదవ్,స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠోత్సవ సందర్భంగా ప్రత్యేక పూజలు: శ్రీ దుర్గాభోగేశ్వర స్వామి ఆలయ ముఖద్వారం, సుంకులా పరమేశ్వరీ,గంగమ్మ విగ్రహా ప్రతిష్ఠోత్సవాల సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు, అర్చకులు శ్యాంసుందర్‌శర్మ,వంశీక్రిష్ణ,శేషఫణి శర్మల ఆధ్యర్యంలో ఉదయం నుంచి శాస్త్రోక్తంగా గణపతి పూజ, పున్యాహవాచనం, విగ్రహారాధన, అలంకార పూజ, జలాధివాసం, ధాన్యాధివాసం, వివిధ హోమాలు చేశారు. వేలాది మంది భక్తులు ప్రతిష్ఠ ఉత్సవాలలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

కోడుమూరులో భారీ వర్షం



కోడుమూరులో పొలంలో నిలిచిపోయిన వాననీరు



రెండు నెలల తర్వాత భారీ వర్షంతో జలకళను సంతరించుకున్న కోడుమూరు హంద్రీనది



సి.బెళగల్లో వర్షనీటిలో మునిగిన ఉల్లి పంట

కోడుమూరు రూరల్: వరుణుడు కరుణించాడు. కోడుమూరులో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దాదాపు గంటకుపైగా ఏకధాటిగా వర్షం కురియడంతో 46.8మి.మీగా నమోదైంది. సుమారు 2నెలల తర్వాత మండలంలో భారీ వర్షం కురియడంతో వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితుల మూలంగా ఒట్టిపోయిన కోడుమూరు హంద్రీనదిలోకి వర్షపునీరు చేరింది. పట్టణ ప్రజలకు నీటి సమస్య తీరినట్లేంది. అదేవిధంగా ఉల్లిపైరుకు మేలు చేకూరిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నీట మునిగిన ఉల్లి పంటలు

సి.బెళగల్: మండలంలో బుధవారం రాత్రి విస్తారంగా వర్షాలు కురిశాయి. 40.2 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదు అయ్యిందని ఏఎస్ఓ ఆదినారాయణ తెలిపారు. బురాన్‌దొడ్డిలో పెద్దనేలటూరు వంక ఉధృతంగా ప్రవహించింది. సి.బెళగల్ చెరువుకు కొంతమేర వర్షపునీరు చేరింది. అయితే సి.బెళగల్ సమీపాన చింతమానుపల్లె దారిలో రైతులు సాగు చేసిన ఉల్లి పంటలు వర్షపు నీటిలో మునిగిపోయాయి. వర్షంతో ఉల్లి పంటలకు దెబ్బతింటున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లారీ బోల్తా

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె జాతీయ రహదారిపై గురువారం ఓ లారీ బోల్తా పడింది. హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు సోలాపూర్ పట్టణం నుంచి చెన్నైకి ఉల్లిగడ్డల లోడ్‌తో వెళ్తున్న లారీ గ్రామ సమీపంలో కొండఘాట్ దిగన తర్వాత అతి వేగంతో వచ్చి కల్వర్టు వద్ద బోల్తా పడిందన్నారు. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయని తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోని ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.

నాటుసారా స్వాధీనం

ఓర్వకల్లు: ఓర్వకల్లులో నాటు సారాను అక్రమంగా విక్రయిస్తున్న వ్యకిని గురువారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక పెండేకంటి నగర్‌లోని నీలిషికారి పేటలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెంకటేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా వాస్తవం ఒప్పుకున్నాడు. దీంతో అతని నుంచి 10 లీటరల సారాను స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు.

యూనిఫాం పంపిణీ



ఓర్వకల్లులో విద్యార్థులకు యూనిఫామ్ అందజేస్తున్న ఎంఈఓ

ఓర్వకల్లు: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాటశాలలకు చెందిన విద్యార్థులకు గురువారం యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఎంఈఓ-2 ఓంకార్ యాదవ్ మాట్లాడుతూ, విద్యార్థుల కిట్లలో భాగంగా మొదట పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్‌తో పాటు, బూట్లు, బెల్టులు, పంపిణీ చేయడం జరిగిందన్నారు. రెండవ విడతలో సమదుస్తులను పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి



ఫ్లోరోసిస్ బాధితులకు వాకర్, చేతి కర్ర అందిస్తున్న వైద్యాధికారులు

కల్లూరు: ఫ్లోరోసిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఫ్లోరోసిస్ కనోసల్టెంట్ డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. గురువారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని పుసులూరు, రెమడూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లోరోసిస్ వ్యాధి రెండు రకాలుగా ఏర్పడుతుందన్నారు. దంతాలకు సంబంధించి దంతాల మీద అడ్డంగా పసుపు రంగు గీతాలు ఏర్పడుతాయని, చాక్ పీస్ రంగులోకి మారి, దంతాలు గుంటలు గుంటలుగా ఏర్పడి పిప్పిపళ్లగా తయారవుతాయన్నారు. దీంతో ఆహారం సరిగ్గా తీసుకోలేరన్నారు. అనంతరం పుసులూరు గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనములో ఫ్లోరోసిస్ వ్యాధితో బాధపడుతున్న బాధితులకు చేతి కర్రలు, మెడ పట్టీలు, నడుము పట్టీలు, వీల్ చైర్లను పీహెచ్‌సీ డాక్టర్ శైలేశ్ కుమార్‌తో కలసి అందజేశారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి



గూడూరులో నిరసన తెల్పుతున్న మహిళలు



పాణ్యంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: కలకతాలో జూనియర్ డాక్టర్ హత్యాచారం కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గూడూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా, వీఓఏ, ఆర్పీ, ఆటో, మున్సిపల్ యూనియన్ల ఆధ్వర్యంలో మహిళలు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేశంలో నిత్యం ఎన్నో కష్టనష్టాలోర్చి ప్రజలకు వైద్య సేవలందించే వైద్యులపై అత్యాచారాలు, హత్యలు చేయడం దారుణమన్నారు. పశ్చిమబెంగాల్ సీఎం వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థినీ ఆత్మకు శాంతి కలగాలని వారు పార్థించారు. కార్యక్రమంలో ఆశా, వీఓఏ, ఆర్పీ, ఆటో, మున్సిపల్ యూనియన్ల సభ్యులు ప్రభావతి, భారతి, శేషమ్మ, మనోహరి, ఆదిలక్ష్మి, గిరిజ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: పశ్చిమబెంగాల్‌లో జూనియర్ వైద్యురాలి హత్యాచారాన్ని నిరసిస్తూ పాణ్యం మండలం ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కళాశాలో గురువారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని, కారకులను కఠినంగా శిక్షించాలన్నారు. వైద్యులకు భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీసీ కో-ఆర్డినేటర్ హరిత, డాక్టర్ సుధామాధురి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న హేమలత

కల్లూరు:కిశోర బాలికలు తప్పకుండా ఆరోగ్య సూత్రాలు పాటించాలని, ఐరన్ అధికంగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిని హేమలత సూచించారు. గురువారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని వామ సముద్రం గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు రక్త హీనతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడడం వలన రక్త హీనత రాదని చెప్పారు.